# సుఖం కిటుకు తెలిసిన వరుడు

బులుసు. జీ-ప్రకాష్

మొదట్నుంచీ అసలతను చవట. ఉద్యోగం లేదు. సద్యోగం అసల్లేదు. చదువు కొద్ది. సంస్కారంపూజ్యం. పైపురాదు. షార్టుహేండు అంతకన్నా రాదు. రేడియో అంటే ఏమిటో తెలియదు. గ్రామ్‌ఫోన్ పాట విని ఎరగడు. సినిమా అంటే వింత. ప్రముఖ శాస్త్రవేత్తలు కనిబెట్టిన ఏ ఆయుధంపేరైనా చెప్పమనండి చూద్దాం! నోరు పెగలదు.

కానైతే ఏదీ తనకు తెలియదని ఒప్పుకోడు. అన్నీ తనకు తెలిసినట్లుగానే ధీమాగా నటిస్తాడు. "నీకేం తెలుసు పోవయ్యా!" అని అంటాడు. ఎదుటివాడెంతవాడైనసరే ఆ జవాబుతో 'తాక్' మనవలసిందే! ఎట్టి మహాపురుషుడు పట్నానికి వచ్చినా అతను చూడ్డానికి కుతూహలపడడు. అవసరముంటే తనే నావద్ద కొస్తాడంటాడు. వారెప్పుడూ రావడమే కనిపించదు కాని.

బ్రహ్మచారి సుమండీ! వయస్సు ముప్ఫైలోపు! పెళ్లి కావాలంటాడు. ఇలాంటి వ్యగ్రమైన నడకగలవాడికి "పిల్లనెవరిస్తారు?" అంటుంది లోకం. "తెలివీ తేటా ఉన్న ఏ మామా కోరి తన పిల్ల నివ్వడు!" అనుకుంటారు ఇరుగుపొరుగువారు. అతని విషయంలో, ఇంకే కారణాలున్నాయో వారికే తెలియాలి.

"నన్ను పెళ్లి చేసుకున్న స్త్రీయే నన్ను పోషిస్తుంది. పోషించాలి!" అంటాడు అతను. అబ్బో! వీడికోరిక లోతైందే! పిల్లో పోషించడాని కెవర్తొస్తుందిక? [illegible] వాళ్లు వెక్కిరిస్తారు.

అతన్ని వెక్కిరించేవాళ్ళు లోకజ్ఞానశూన్యులు. అతని కోరిక సబబైంది. తిరోమార్గం కోసం అన్వేషించక్కర్లేదు. ఉన్నది!- అతనొక గొప్ప వ్యక్తి, ధనికుడూ కాగల అవకాశముంది. పెళ్ళిచేసుకుని సుఖజీవనం గడిపే అదృష్టం ఉంది.

ఎలాగ? ఇప్పట్లో ప్రతియువతీ కోరుతున్న దేమంటే తమకు స్వాతంత్ర్యం కావాలని. చదువుకున్న కాలేజీ లేడీ స్టూడెంట్స్‌ని అడిగి చూడండి చెబుతారు. స్త్రీకి స్వేచ్ఛ ఉట్టినే రాదు... మొగాడు మ్రానైతేనే తప్ప!- ఇతగాడికా క్వాలిఫికేషనుంది.

రెండుపూటలూ వంట చేస్తాడు. నానా చాకిరీ చేస్తాడు. భార్య ఎక్కడికి పోయినా అడ్డడు. ఎప్పుడు తిరిగి వచ్చినా ఏమీ అనడు. రాగానే సేదతీరుస్తాడు? అందుకు స్త్రీ ఉబలాటపడుతుంది. అదే ఆమెకు కావల్సింది. అందుకే కాలేజీ విద్యార్థినులు అతన్ని పెళ్లి చేసుకోగలరు.

తెలివైనవాడు గనకే అతను అంత పట్టుదల వహించాడు, తన పెళ్లికి! ఈమాత్రం తెలియని వెధవలోకానికి. అతడు నన్ను సలహా అడిగాడు. నేనతనికో ఉపాయం చెప్పాను. డబ్బు లేదన్నాడు. నేను డబ్బు మదుపెట్టి ఆ పని చేశాను, అతని తరఫున.

అతడనుకున్నట్లు, ధనికురాలైన స్వేచ్ఛాకాముకినే పెళ్ళాడగలడు,రవంత ప్రయత్నిస్తే!

నాలుగురోజులు పోయాక "హిందూ"లో "మేట్రిమోనియల్ కాలమ్స్", చూసుకుని యువతులంతా అప్లికేషన్ల వర్షం కురిపించారు. ఇంటర్వ్యూకి వచ్చారు.

కొందరు యువతులు, అతన్ని వారే పెళ్లి చేసుకుని పోషిస్తామని బ్రతిమాలుకుంటున్నారు. ఈ బ్రతిమాలినవాళ్ళంతా బియ్యేలు, ఎమ్మేలు పాసైన యువతులే!

ఇప్పుడతను ఎంచుకుంటున్నాడు!!

"అందమైనదీ, ఇంటి పనులలో నేర్పరీ, భార్యగా లభిస్తే ఆదర్శ వివాహ మనిపించుకుంటుంది", అంటున్నాడొక రచయిత. ఈయన బహు భార్యాత్వం ప్రచారం చేస్తున్నట్టు కనిపిస్తోంది.